# కోరిన కోరిక

శ్రీమతి అయినపల్లి సుభద్రాకుమారిగారు

"మీరు...ఈ పిలకతీసెయ్యకూడదూ..." అంది మృదుమధురంగా తమలపాకులచిలకలు నోటి కందిస్తూ నాల్గోరోజున. ఈ నవనాగరికతా యుతప్రపంచంలో భర్తని అలాకోరనిదెవరు?

నాల్గోరోజునే తనని అలాప్రశ్నించటం తలకొట్టి పాతినట్టు తలంచాడు ఆమూర్ఖుడు! భార్య తన పూర్వీకులపట్ల, గృహదేవతలపట్ల, తల్లి, అన్నదమ్ములపట్ల యెంతో అపరాధంచేసిందని భావించాడు! తననేదో అగాధ నరకంలోనికి లాగుతోంది అనుకున్నాడు!

కామశాస్త్రికి తండ్రిలేడు; తల్లి ఉన్నది; నలుగురన్నదమ్ములు, ఓవెధవాడపడుచు వుంది. అంతా ఇక్ష్వాకుల భారసాలనాటిమనుష్యులు, లోకమంతా ఏవిషయాలు ఉత్తమూఢనమ్మకాలంటారో వాటిమీదే వారికి అమిత విశ్వాసం. వారి వంశంవారంతా గర్విష్ఠులు, అధికారవంతులు. పాలం కాపుల్నీ, కరణాల్నీ ఇతరుల్నీ నిర్లక్ష్యంగాచూస్తారు. దానికి కారణం వూరివారిచ్చిన గౌరవ మర్యాదలే! ప్రయాణము, వార్తాపత్రికలు, కలహాము, సంస్కారము, వారియింటి దరిజేరవు. కాని వారిగృహం, పావనమైనది. యెల్లప్పుడు మంత్రజపాలు, వేదపఠనాలు జరుగుతుంటయ్. ఇతరులతో ఎప్పుడూ సంబంధంపెట్టుకోరు. దేశమంతా కాలచక్ర ప్రభావానికి లోబడి మారిపోతుంటె ఆవంశం నేటికికూడా అలాగే వుండిపోయింది ధృవ నక్షత్రంలా! వితంతువివాహాలు, క్రాఫింగు కట్టింగుమీసాలు, గూడకట్లు, పక్కపాపిళ్లు, ఆంధ్రోద్యమాలు, చలనచిత్రాలు వీటిమోత వారికి ఏదో పాతాళలోకంలోంచి పాతిక ఉంఖణాలు చేసినవాడిమాటలా విన బడుతుంది. అటువంటికుటుంబములో జన్మించిన కామశాస్త్రికి నాగరికత, నవ్యత్వాలలో మునిగి తేలుతున్న కుటుబంలో జన్మించిన ప్రభావతి "పిలక తీయకూడదా"అని అడగటం క్షమించరాని అపరాధంగా తోచ టంలో ఆశ్చర్యంలేదు. మర్నాడు ఈవిషయం తల్లి, అన్నదమ్ములకు పాఠం వప్పగించాడు.

"నిన్నకాక మొన్న వచ్చిందోలేదో అప్పడే ఆకతాయితనమా?" అనిఒకరు.

వాళ్ల అన్నాయి క్రాపునున్నగదువ్వుకొని సిగరెట్టుకాలుస్తూ వీణమీటుతుంటె వీణ్ణిగూడ క్రాపుదువ్వుకొని వెనకాల తంబురా సుతివెయ్యమంటుందా?" అని ఒకరు.

"వాళ్ల చిన్నఅన్నాయికిమల్లే జ్వరంకొల్చే గాజుపుడక జేబులోపెట్టుకొని ప్రతియింటికివెళ్లి అయిందానిచేతులు కానిదానిచేతులు పట్టుకు చూడ మంటుందా?" అనిఒకరు ప్రారంభించారు. యిదంతా పక్క గదిలోంచి వింటున్నప్రభావతికి అన్నదమ్ముల్ని ఎత్తిపొడుస్తున్నారని ఏడ్వాలో, భర్తయింతఘనకార్యం చేశాడేఅని నవ్వాలో అర్థంకాక అలాగే నిల్చుండిపోయింది నిట్టూర్పులువిడుస్తూ. పెండ్లిసాడే మొరపెట్టుకుంది తనని ఆ అసాగరికపు కుటుంబంలో పడెయ్యవద్దని. కాని తండ్రి ప్రభావతియొక్క ఆందోళన తెల్సుకో లేకపోయాడు. దగ్గర్లోవుంటుంది. తిండి గుడ్డలకి లోటుండదని కట్టబెట్టేడు. కానీ తర్వాత తెల్సుకున్నాడు తనకూతురి పీకతానే నిర్దయగ నులిమేశానని!

పక్కపాపిడి తీసుకుంటేతప్పు. కాస్తతెల్లచీరకట్టుకొని తలనిండా పువ్వులుపెట్టుగుంటేతప్పు బోగంది బోగంది అంటారు. గదిలో రాత్రిమాటలసందర్భంలో భర్తతోనవ్వితేతప్పు. ఓనాడు ప్రభావతి నూతి

దగ్గఱ నీళ్లుతోడుతోంది. నీళ్లతొట్టిద్వారానికి గుడ్డముక్క అడ్డులేదు అదిచూడకుండా తోడటం మూలాన్ని నీళ్లన్నీ కారి ముందువాకిలంతా తడిసిపోయింది. వెధవాడబడుచు "రెక్కలుముక్కలు చేసుకుని వాకిలంతా అలికాను, తగలబెట్టేసింది. ఛి, ఛీ పనిచేతకాదు, ఏమిచేతకాదు. మానెత్తిన ఎక్కించేందుకు కన్నారమ్మా నిన్నూ" అని సాధించటం ప్రారంభించింది. పొలంనుంచి చెమటలు కక్కుతూ కామశాస్త్రి వచ్చాడు. చేతిలోవున్న తాటికమ్మతో "కళ్లులేవా" అనిగొడ్డును బాదినట్టుబాదేడు. ఒళ్లంతా కదుములుకట్టేసింది. అయినా సహించింది ప్రభావతి. కోపించి భోజనంచెయ్యకుండా మంచమెక్కాడు శాస్త్రి. చెంగుపరచుకొని దెబ్బలబాధను సొమ్మసిల్లి నిద్రపోయింది. మామూలుప్రకారం అల్లారంగడియారం 3 గంటలకి గణగణ మోగింది(అదిప్రభావతి తెచ్చుకున్నదే). ప్రభావతిలేచి వెండిగిన్నెలోకి కాగుతున్నపాలుతీసి అటుకులునాన బోసింది. సబ్బుతో ముఖంకడుక్కుంది. శాస్త్రిలేచాడు; "భోంచేశారా"అనిఅడిగింది మంచినీళ్లిస్తూ. "లేదు" అన్నాడు. 'అటుకులు పాలల్లో బోశాను తెచ్చేదా' అందిఎంతోప్రేమవుట్టిపడేటట్లూ. కొట్టినదెబ్బలు నిద్దట్లో మర్చిపోయింది అనుకున్నాడు. "తే"అన్నట్లుగా కళ్లు ఎగరేశాడు. అటుకులగిన్నె చేతికందిచ్చింది. చేతులమీద దెబ్బలు యింకారక్తంకమ్మి అలాగేవున్నాయి! అన్నంతిన్నావా? అనేనా అడక్కుండా అటుకులగిన్నె లగాయించాడు!

భర్త సుఖంగావుంటె అంతే చాలనుకుంది విధిలేక! వెధవాడపడుచు ఏదోవంకబెట్టి తిడ్తూనేయుంది రోజూ. ఓనాడు ప్రభావతి బయటుంది. పుట్టింటివారిచ్చిన దుప్పట్లుచినిగిపోయాయ్. "చలిగవుంది. ఏదైనా దుప్పటైనా, మీతమ్ముడి పంచయినా యిమ్మ"ని అడిగింది ఆడబిడ్డని. ఆవిడ "మీపుట్టింటివాళ్లు దరిద్రులా? తెచ్చుకోలేకపోయావా! ఎవరిస్తారనుకున్నావూ?" అనిసాధించటం ప్రారంభించింది.

"పుట్టింటివాళ్లు ఎన్నాళ్లనియిస్తారు"?కట్టుకున్నవాళ్లుయివ్వకపోతే?అంది. అదిపట్టుకెళ్లి యింకనాలుగు, కల్పించి తమ్ముడిచెవికరిచింది! అప్పగారంటే తమ్ముడికి ఎక్కడిలేని లక్ష్యమూను. శాస్త్రిరుద్రావతార మయ్యాడు! పక్కనున్న వంటకట్టె విశిరాడు భార్యమీదికి. అదిచెంపని గాయంపర్చింది, రక్తంకారుతూంది. అప్పటిదాకా ఓపికపట్టి ఊరుకున్న ప్రభావతి యిక సహించలేకపోయింది. "కట్టుకున్నవారే దుప్పటిస్తారనటం తప్పా? నేనెవర్నీ అనవసరంగతిట్టలేదు, కొట్టలేదు" అందిఏడుస్తూ.

"ఛీనోరుముయ్"

"ఎందుకు మూసుకోవాలి? కన్నతల్లిదండ్రులకేనా యివ్వని స్వాతంత్ర్యం స్త్రీ భర్తఅనేవ్యక్తికిస్తుంది ఎందుకిస్తుంది? భర్తలోవున్న ప్రేమమధువుని గ్రోలటానికి. ఆభర్తనే వ్యక్తిలో ప్రేమలేక హృదయం పాషాణమయితే యింకగతేమిటి?"

"చాల్లే కట్టిపెట్టు ...ఏం యింకోకట్టెవిసరాలా?"

"విసరండి ఆకట్టెతోపాటు ఈకట్టెనిగూడా కటువుకిగట్టి అగ్నిలోకి విసరచ్చు" అంది. చెంపనుంచి కారుతున్నరక్తంతో బట్టలుతడిశాయి!

"నీ అన్నలు గొప్పవాళ్లని చూస్తున్నావేమో, ఒడ్డూ పొడుగూ, లావూవున్నారుగదా అని.పిల్లనిచ్చాక కుక్కనిపేనల్లేపడివుండాల్సిందే,"

"ఆడపిల్లల్ని కన్నవారు అంతలోకువా? నేను మీరనుకున్నంత ఘోరపాపం చెయ్యలేదు. అదంతా కల్పన. నేనడిగింది దుప్పటిగుడ్డమాత్రం; దానికోసం నాఅన్నలు, తండ్రులు, తాతలుగూడ మీనోట్లో కొచ్చారు!" అంది చెంపనుంచి కారుతున్న రక్తంతుడుచుకుంటూ.

"చూశావురా? చూశావురా? కామయ్యా! ఇప్పుడేకాదు. నన్నెప్పుడూ అలాగే ఆడిపోసుకుంటుందది. నేను కల్పించిచెప్పేనా? ఎంతనంగనాచివే? యింతకూ ఆయనపోవటం, నేను మీయింటిదగ్గరఉవుండటం యింతలోకువయ్యాను" అంది లేనిఏడ్పుతెచ్చుగుంటూ ఆడపడుచు. ఈ మాటలు శాస్త్రికోపాన్ని ద్విగుణీకృతంచేశాయి. తనుఏంచేస్తున్నదీ, భార్యఏస్థితిలోవున్నదీ తెల్సుకోకుండా జుట్టుపట్టుకుని "నీదిక్కున్నచోటచెప్పుకో..." అనిబయటి కీడ్చేశాడు. రక్తంగుడ్డల్తో ఆరాత్రే పుట్టింటికి చేరింది. సుబ్బారాయుడుగారు బావురుమన్నాడు కూతురిగతిచూసి. అన్నగార్లు ఈక్షణంవాణ్ణి ఖూనీచేస్తామన్నారు. దూరంఆలోచించి ఆపుచేశాడు తండ్రి. పాపం ప్రభావతి రెండేళ్లుపుట్టినింటిదగ్గఱ అజ్ఞాతవాసంచేసింది.

♦ ♦ ♦

ఆనాడు పౌర్ణమి. చంద్రుడు తనచల్లటికిరణాల్ని వెదజిమ్ముతూప్రయాణం చేస్తున్నాడు ఆకాశంలో. వీధిలోతలుపు కొట్టిన చప్పుడయితే తలుపుతీసింది ప్రభావతి. "ప్రభా"అన్నాడు కామశాస్త్రి! ఆనవాలు పట్టలేకపోయింది. బెంగాలీక్రాపు, తెల్లటి గ్లాస్గోలాల్చీ, బాడీబనీను పయికి కనిపిస్తోంది, అండర్ వేరు పైకి కనుపిస్తూ మల్లుపంచ, నోట్లోసిగరట్. ప్రభావతి తనకళ్లని తానే నమ్మలేకపోయింది.

"ప్రభా, నువ్వుకాపరానికొచ్చిన నాల్గోనాడు కోరినలాగే వచ్చాను భర్తలేక తనెల్లా బాధ లనుభవిస్తోందో, నిన్నుకూడా తనకి తోడుగ చేసుగుందామని మనయిద్దర్నీ విడదీయటానికి ఎన్నో ఎత్తులువేసింది మాఅక్కయ్య. అప్పట్లో నిజానిజాలను తెల్సుకోలేక నిన్ను నానావిధాల హింసించాను. యిప్పటికి కళ్లుతెరిచాను. నీకోరిక నాగుండెల్లోప్రతిధ్వనించింది! నీవుకోరినట్లుగ తయారవటానికి యింతకాలంపట్టింది. నాలో సగభాగం లేకపోవటం ఎంతోలోటనిపిస్తోంది. మనగృహానికెంతో లోటుగవుంది. నీవుకోరినట్లుగానే వచ్చానుగా. ఇంకాకోపమేనా? క్షమించవూ 'ప్రభా' క్షమించవూ!"

"రా......మనయింటికి పోదాంరా......మన 'గృహలక్ష్మి'ని పూజిద్దాం! తరిద్దాం.!"

మరుసటి సంవత్సరమే ప్రభావతి పయ్యెదమాటునుంచి మనమడు సుబ్బారాయుడుగారిని" బూచి బూచి" అని ఒచ్చీరాని తొస్సిపల్కులతో వెక్కిరించాడు ! ప్రభావతి కోరిన కోరిక ఫలించింది.

